

ఫైర్‌లైన్ పనులు షురూ.. 8లో▸

కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలోని అటవీ ప్రాంతాల్లో కార్చిచ్చు చెలరేగకుండా ఫారెస్ట్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఫైర్‌లైన్ పనులు ముమ్మరం చేశారు.

నేటి నుంచి బియ్యం పంపిణీ

కైలాస్‌నగర్: చౌకధరల దుకాణాల నుంచి ఫిబ్రవరికి సంబంధించి రేషన్ బియ్యం పంపిణీని బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు డీఎస్‌వో టీ కిరణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో యూనిట్‌కు ఐదు కిలోల చొప్పున అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23వరకు లబ్ధిదారులు బియ్యం తీసుకోవచ్చని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.6/14.8

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా అనిపిస్తుంది. రాత్రి చలి కాస్త తగ్గుతుంది.

మెరుగు పడని వృద్ధి!



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తలసరి ఆదాయం, జిల్లా స్థూల ఉత్పత్తి మెరగుపడడం లేదు. రెండేళ్ల తర్వాత కోవిడ్‌తో తేరుకున్న తర్వాత కూడా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్థికంగా పరిపుష్టి కావడం లేదు. 33జిల్లాల్లో ఇంకా ఉమ్మడి జిల్లా జీడీడీపీ (గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్), తలసరి ఆదాయం సూచికలు ఇంకా మెరుగు పడాల్సి ఉంది. ప్రతీ ఏడాది రాష్ట్ర ప్రణాళిక విభాగం విడుదల చేసే రాష్ట్ర ఆర్థిక, సామాజిక, ఆర్థిక ముఖచిత్రం 2023ను ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ ముందు ప్రవేశపెట్టింది. ఈ వివరాల ప్రకారం ఉమ్మడి జిల్లా ఇంకా ఆయా రంగాల్లో వృద్ధి చెందాల్సి ఉంది.

- జీడీడీపీ, తలసరి ఆదాయం అంతంతే
- పెరుగుతున్న విద్యుత్, ఎల్‌పీజీ వాడకం
- ఉమ్మడి జిల్లాలో ఇంకా మారాల్సిన పరిస్థితులు
- సామాజిక ఆర్థిక ముఖచిత్రం 2023లో వెల్లడి

అభివృద్ధికి సూచిక జీడీడీపీ

ఒక ప్రాంతంలో ఒక ఆర్థిక సంవత్సరం జరిగిన అంతిమ వస్తు సేవల వినియోగం ఆ ప్రాంత జీడీడీపీని సూచిస్తుంది. ఈ జీడీడీపీ ఆ ప్రాంత అభివృద్ధి సూచికగా ఉంటుంది. రాష్ట్రంలో ఇంకా కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాల జీడీడీపీ మెరుగు కావాల్సి ఉంది. అలాగే తలసరి ఆదాయం మెరుగుపడాల్సి ఉంది. 2022 జూన్‌లో విడుదల చేసిన సామాజిక ఆర్థిక ముఖచిత్రంలో పెరుగుదల కనిపించలేదు.

జీడీడీపీ 2018-19నుంచి 2020-21 వరకు(రూ.లక్షల్లో)

జిల్లా	ప్రస్తుత ధరలు (ఎఫ్ఆర్ఈ)	స్థిర ధరలు (ఎఫ్ఆర్ఈ)
ఆదిలాబాద్	12,68,948	8,05,296
నిర్మల్	12,57,558	7,54.150
మంచిర్యాల	15,48,421	9,78,432
కుమురంభీం	7,93,501	4,83,622



తలసరి ఆదాయం 2018-19నుంచి 2020-21 వరకు (రూ.ల్లో)


జిల్లా	ప్రస్తుత ధరలు (ఎఫ్ఆర్ఈ)	స్థిరధరలు
ఆదిలాబాద్	1,52,455	94,587
నిర్మల్	1,52,634	89,308
మంచిర్యాల	1,60,883	98,914
కుమురంభీం	1,31,843	78,282



పశుసంతతి పెంపు శాతంలో (2019 నాటికి)



విద్యుత్ కనెక్షన్లు (2021-22)



విద్యుత్ కనెక్షన్లలో ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల ముందంజలో ఉండగా, కుమురంభీం అత్యల్పంగా ఉంది. ఎల్‌పీజీ ఉపయోగిస్తున్న గృహాల సంఖ్య పెరుగుదల కనిపిస్తోంది.

ప్రైవేట్ స్కూళ్లు క్రమంగా పెరుగుతున్నాయి. సర్కారు బడుల్లో విద్య నాణ్యత పెంచాలని ప్రయత్నాలు జరుగుతున్నా ప్రైవేట్ స్కూళ్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఉమ్మడి జిల్లాలో నిర్మల్‌లో అధికంగా ఉండగా, కుమురంభీం ఆసిఫాబాద్‌లో అత్యల్పంగా ఉన్నాయి.

అందుబాటులో ఉన్న ప్రైవేట్ స్కూళ్లు



జిల్లా	స్కూళ్లు
ఆదిలాబాద్	157
నిర్మల్	209
మంచిర్యాల	228
కుమురంభీం	128

అడవులను కాపాడుతున్నాం



అడవుల జిల్లాగా పేరున్న ఆదిలాబాద్ రాష్ట్రంలో అత్యధిక అటవీ విస్తీర్ణమున్న ఐదు జిల్లాల్లో ఉమ్మడి జిల్లా పరిధిలో రెండు జిల్లాలు ఉన్నాయి. రాష్ట్రంలో మొదటి ఐదు జిల్లాలు చూస్తే, కొత్తగూడెం, ములుగు, నాగర్‌కర్నూల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోనే 50శాతం అడవులు విస్తరించి ఉన్నాయి.

ఈ–పంచాయతీలో భాగంగా పల్లెప్రగతి యాప్‌లో రోజువారీగా పారిశుధ్యం, రోడ్లు, మురుగు కాలువలు తదితర నివేదికలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు రోజువారీగా వివరాలు యాప్‌లో అప్‌లోడ్స్ శాతంలో చూస్తే...

ఆదిలాబాద్	74.77
నిర్మల్	80.54
మంచిర్యాల	76.28
కుమురంభీం	71.39

ఉపాధిహామీ పథకం గ్రామీణ ప్రాంతంలో ప్రతిరోజూ కనీస కూలి దక్కేలా చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో లక్ష్యానికి మించి నిర్మల్‌లో మాత్రమే కూలీలు వెళ్తున్నారు. ఆదిలాబాద్‌లో తక్కువగా ఉంది.



ఉపాధిహామీలో రోజువారీగా కూలీల పని లక్ష్యం, నమోదైన వివరాలు (పర్సన్ డేస్, లక్షల్లో)

జిల్లా	లక్ష్యం	నమోదు	శాతం
ఆదిలాబాద్	36.5	30.6	84
నిర్మల్	41	44.6	109
మంచిర్యాల	26.2	23.5	90
కుమురంభీం	29.7	29.6	100

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ముఖరా కే సర్పంచ్



కలెక్టర్‌కు సేంద్రియ ఎరువు ఇస్తున్న మీనాక్షి

ఇచ్చోడ: మండలంలోని ముఖరా కే సర్పంచ్ గాడ్గే మీనాక్షి మంగళవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిశారు. గ్రామంలో తడి, పొడిచెత్తతో తయారు చేస్తున్న సేంద్రియ ఎరువును కలెక్టర్‌కు అందించారు. పల్లెప్రగతి ద్వారా 100శాతం ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న తమ గ్రామాన్ని సందర్శించాలని కలెక్టర్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ముఖరా బీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్ ఉన్నారు.

రిటైర్డ్ హోంగార్డులకు సన్మానం



రిటైర్డ్ హోంగార్డులతో ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులను మంగళవారం పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. హోంగార్డులు ఉద్యోగంలో ఉన్నప్పుడే ప్రభుత్వ, ప్రైవేట్ పెన్షన్ పథకంలో చేరాలని, రిటైర్డ్‌మెంట్ తర్వాత పెన్షన్ వస్తుందని తెలిపారు. అంతకుముందు ఉద్యోగ విరమణ పొందిన షేక్ రహిమతుల్లా, ఎం.అశోక్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అదనపు ఎస్పీ రాములునాయక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటి, శ్రీపాల్, వంశీకృష్ణ, దత్తు పాల్గొన్నారు.

ప్రొవిజనల్ జాబితా విడుదల

ఆదిలాబాద్‌టౌన్: ఎన్‌హెచ్‌ఎం పరిధిలో గల ఆప్టోమెట్రిస్ట్ పోస్టుల ప్రొవిజనల్ జాబితా విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాను adilabad.telangana.gov.in తోపాటు డీఎంహెచ్‌వో కార్యాలయ నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే ఈనెల 10లోగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో సర్టిఫికెట్లను అందించి పొరపాట్లను సరిచేసుకోవాలని సూచించారు. అలాగే ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్, హోమియోపతి మెడికల్ ఆఫీసర్లకు సంబంధించిన పోస్టుల వివరాలను డీఎంహెచ్‌వో కార్యాలయ నోటీస్ బోర్డుతో పాటు వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. ఈనెల 20లోగా దరఖాస్తులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్–5, హోమియోపతి మెడికల్ ఆఫీసర్–1 పోస్టులను భర్తీ చేయనున్నట్లు వివరించారు.

11 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

ఆదిలాబాద్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హైయ్యర్ పరీక్షలను ఈ నెల 11నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, లోయర్ హైయ్యర్ గ్రేడ్ పరీక్ష ఈ నెల 11నుంచి 14వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, టైలరింగ్ లోయర్, హైయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈ నెల 11నుంచి 13వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు http:// bse. telangana. gov. in లో అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేసి హాల్‌టికెట్లు పొందవచ్చని తెలిపారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని పేర్కొన్నారు. టైలరింగ్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట కుట్టుమిషన్‌ను తప్పనిసరిగా తీసుకుని రావాలని సూచించారు.

గోశాల నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని బంగారిగూడలో నిర్మించిన గోశాల నిర్వహణకు ఎన్జీవోల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌ను సంప్రదించాలని, ఇతర వివరాలకు 9849907852 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. వివరాలు Adilabad Municipalitytelangana.gov.inలో పొందుపర్చినట్లు వివరించారు.

సబ్‌స్టేషన్ ముట్టడించిన రైతులు



బోథ్: రైతులను సముదాయిస్తున్న పోలీసులు

బోథ్: మండలంలోని పొచ్చర క్రాస్ రోడ్డు వద్ద గల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారు. కనుగుట్ట, పొచ్చర, ధన్నూర్ తదితర గ్రామాల రైతులు మంగళవారం సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని వాపోయారు. గంటపాటు రోడ్డుపై ఆందోళన చేయగా ఇరువైపులా వాహనాలు నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. ఎస్సై రవీందర్ వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా పోలీసులు, విద్యుత్ అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వగా ఆందోళన విరమించారు.

తలమడుగు మండలం కజ్జర్లలో..

తలమడుగు: విద్యుత్ కోతలను నిరసిస్తూ మండలంలోని కజ్జర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ కోతల కారణంగా పంటలకు సకాలంలో నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని వాపోయారు. రాత్రి వేళ విద్యుత్ ఇవ్వడంతో పంట పొలాల్లోనే కరెంట్ కోసం నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంజేశారు. అధికారులు రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతూ... కనీసం ఐదు గంటలు కూడా సక్రమంగా ఇవ్వండలేదని ఆరోపించారు. కోతలు లేకుండా కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని డీఈవో ప్రణీత పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గెజిటెడ్–1 పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భాష సామర్థ్యాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. చదవడం, రాయడం నైపుణ్యం సాధించేలా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. మండల స్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికవుతారని, అక్కడ ప్రతిభ కనబర్చిన వారు రాష్ట్రస్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి కంటె నర్సయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది. మంగళవారం ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ కోర్టు తీర్పుతో అధికారులు జాబితాను ప్రకటించలేదు. కొంతమంది ఉపాధ్యాయులు హైకోర్టుకు వెళ్లడంతో తాత్కాలికంగా ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. 317 జీవో ద్వారా ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ప్రక్రియ ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే అధికారులు బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాను సిద్ధం చేసి ఉంచారు. ఖాళీలను ప్రకటించాల్సి ఉండగా, కోర్టు ఆదేశాలతో ప్రక్రియ ఆగిపోయింది. దీంతో గత కొన్నేళ్లుగా బదిలీలు, పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు నిరాశే మిగిలింది. బదిలీల కోసం జిల్లాలో 1605 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా, దాదాపు 250 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశాలున్నాయి.


జెడ్పీ ఎదుట భాష పండిట్, పీఈటీల ధర్నా



నినదిస్తున్న భాష పండితులు

కైలాస్‌నగర్: భాష పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి అర్హులకు పదోన్నతి కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక పోచ్చన్న, హిందీ భాష సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం జెడ్పీ కార్యాలయం ఎదుట పీఈటీలు, భాష పండిట్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భాష పండిట్లు, పీఈటీలు 25 ఏళ్లుగా ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ ప్రైమరీ వేతనాన్ని పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తమతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ పోస్టులను అప్‌గ్రేడ్ చేయడం లేదని వాపోయారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పోస్టులను ఉన్నతీకరించి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

తిరుపతి నుంచి కాశీకి పాదయాత్ర



రామకృష్ణకు స్వాగతం పలుకుతున్న స్వర్ణకారులు

కైలాస్‌నగర్: తిరుపతి పట్టణానికి చెందిన రామకృష్ణ తిరుపతి పుణ్యక్షేత్రం నుంచి కాశీకి పాదయాత్ర చేపట్టారు. నెలక్రితం తిరుపతి నుంచి బయలుదేరిన ఆయన మంగళవారం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకున్నారు. ఆయనకు స్వర్ణకార సంఘం నేతలు స్వాగతం పలికి ఆతిథ్యమిచ్చారు. ఆయనను సన్మానించి ఆర్థిక సాయం అందించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో శ్రీరామోజు ఆంజనేయులు, రంగు రాజు, భాస్కర్, సునీల్, నాగేశ్వర్‌రావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై పనిచేయాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరించేలా రెవెన్యూ యంత్రాంగం పని చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్‌తో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లతో ధరణి, ఇతర రెవెన్యూ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తహసీల్దార్లు కార్యాలయాల్లో అందుబాటులో ఉండి భూసమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయికి అర్జీలు రాకుండా ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారమయ్యేలా తహసీల్దార్లు చొరవ చూపాలన్నారు. ఆర్డీవోలు ఎప్పటికప్పుడు వారి పరిధిలోని కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ధరణి, ఇతర అంశాలను పర్యవేక్షించాలన్నారు. ఇప్పటివరకు 414 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వారంలోగా పరిష్కరించేలా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, కదం సురేశ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి అరవింద్ కుమార్, తహసీల్దార్లు, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు

అధికారులతో సమీక్షా సమావేశం

కలెక్టరేట్ సమావేశ మందిరంలో పల్లె ప్రగతి, సెగ్రిగేషన్‌షెడ్, వైకుంఠధామాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, హరితహారం, పల్లె ప్రకృతి వనం, బృహత్ పల్లె ప్రకృతీవనాలు, ఉపాధిహామీ తదితర అంశాలపై కలెక్టర్ రాహుల్‌రాజ్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే వానాకాలంలో టైఫాయిడ్ జీరో స్థాయికి తీసుకురావాలని, ఏ ఒక్క టైఫాయిడ్ కేసు నమోదు కాకుండా చూడాలన్నారు. జూన్ 2నాటికి ప్రతీ ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకునేలా చూడాలని సూచించారు. ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలో ఎలాంటి అభ్యంతరం లేకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలన్నారు. బ్యాంకు లింకేజీ క్రింద ఇప్పటివరకు 79 శాతం ప్రగతి సాధించామని, ఈ సంవత్సరం ముగిసే నాటికి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జడ్పీ సీఈవో గణపతి, డీఆర్డీవో కిషన్, డీపీవో శ్రీనివాస్, ఏపీడీ రవీందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: టైంస్కేల్ వర్తింపజేయాలని ఉపాధిహామీ కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ పీ రాజు, కార్యదర్శి సతీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశమందిరం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన సీఎం కేసీఆర్ మాట తప్పారని ఆరోపించారు. సెర్ప్ ఉద్యోగులకు మాత్రమే పే స్కేల్, క్రమబద్ధీకరణ ప్రకటించి తమను విస్మరించడం సరికాదన్నారు. సెర్ప్ ఉద్యోగులతో సమానంగా తమనూ క్రమబద్ధీకరించి పేస్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేందర్, శివకుమార్, నరేందర్, అనురాధ, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంజేపీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

ఆదిలాబాద్‌: జిల్లా కేంద్రంలోని జైనథ్ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ మీట్ పోటీలకు ఎంపికయ్యారు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్.నితిన్‌రెడ్డి షాట్‌పుట్, పదో తరగతి చదువుతున్న బీ కార్తిక్ లాంగ్ జంప్‌లో పోటీ పడనున్నారు. ఈనెల 9నుంచి 12వరకు బీహార్ రాజధాని పాట్నాలో జరగనున్న పోటీల్లో వారు పాల్గొంటారు. మంగళవారం వీరిని పాఠశాలలో ప్రిన్సిపాల్ రంగన్న, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, వార్డెన్ శ్రీనివాస్, పీఈటీలు రాకేశ్, జ్యోతీశ్వరన్ అభినందించారు. ఆర్‌సీవో గోపీచంద్, కన్వీనర్ అంజలి ఓ ప్రకటనలో వీరికి అభినందనలు తెలిపారు.

జాతీయ సదస్సుకు నిపాని హెచ్‌ఎం



సంతోష్

తాంసి: జాతీయ విద్యా ప్రణాళిక, పరిపాలన సంస్థ ఢిల్లీ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే జాతీయ సదస్సుకు భీంపూర్ మండలం నిపాని పాఠశాల హెచ్‌ఎం భేదోడ్కర్ సంతోష్ ఎంపికయ్యారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి నలుగురు ఎంపిక కాగా ఇందులో సంతోష్‌కుమార్‌కు అవకాశం దక్కింది. కరోనా సమయం, ఆ తర్వాత విద్యాప్రమాణాలు పెంచడం కోసం పాఠశాలలో వివిధ రకాల్లో బోధించడంతో సదస్సుకు ఎంపికయ్యారు. సదస్సులో కరోనా సమయంలో పాఠశాలలో చేపట్టిన కార్యక్రమాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, వాటి ఫలితాల గురించి ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు హెచ్‌ఎం సంతోష్ తెలిపారు.సంతోష్‌ను నిపాని గ్రామ సర్పంచ్ ప్రమీల, ఎంఈవో శ్రీకాంత్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆదిలాబాద్‌టౌన్‌: కంటి వెలుగు రెండో విడతను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శైలజ కోరారు. జిల్లాకేంద్రంలోని బొక్కల్‌గూడలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారందరు కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ విజయసారథి, రవికుమార్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఫైర్‌లైన్ పనులు షురూ..



అడవిలో ఫైర్‌లైన్ పనులు చేపడుతున్న సిబ్బంది

- వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు
- మూడు రోజులుగా పనులు ముమ్మరం



ఎండిన ఆకులను తగులబెడుతున్న సిబ్బంది

ఉట్నూర్: కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలోని అటవీ ప్రాంతాల్లో కార్చిచ్చు చెలరేగకుండా ఫారెస్ట్ అధికారులు ఫైర్‌లైన్ పనులు ప్రారంభించారు. వేసవి ప్రారంభం అవుతుండడం, ఆకురాలే కాలం కావడంతో నిప్పు అంటుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అడవిలో నిప్పు రాజుకుంటే వన్యప్రాణులకు మేత కరువవ్వడంతో పాటు మంటల్లో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అటవీశాఖ అధికారులు టైగర్ జోన్ ఏరియాలో ఫైర్‌లైన్ పనులను గత మూడు రోజుల నుంచి ముమ్మరం చేశారు.

పులుల సంరక్షణ కేంద్రంలో..

కేంద్ర ప్రభుత్వం 2012లో కవ్వాల్ అభయారణ్యాన్ని 42వ పులుల సంరక్షణ (టైగర్ జోన్) కేంద్రంగా గుర్తించి ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. కవ్వాల్ అభయారణ్యంలో 892.23 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణాన్ని కోర్ ఏరియాగా, 1123.212 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని బఫర్ ఏరియాగా గుర్తించి టైగర్ జోన్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అయితే పులుల సంరక్షణ కేంద్రంలో నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి మామడ, కడెం, ఖానాపూర్, జన్నారం, లక్సెట్టిపేట్ మీదుగా మంచిర్యాల వరకు, ఇటు ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఇంద్రవెల్లి, ఉట్నూర్, బీర్సాయిపేట్, ఉడుంపూర్, ఇందన్‌పల్లి, జన్నారం మీదుగా మంచిర్యాల వరకు ప్రధాన రహదారులున్నాయి. ఈ రహదారుల వెంట నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వేసవి ప్రారంభం కావడం.. ఆకురాలే కాలం కావడంతో అడవిలో రహదారులకు ఇరువైపులా, అడవిలో ఆకు రాలడం ప్రారంభమైంది. ఇలా రాలే ఆకులు రహదారులపై కుప్పలుగా పడడం వాహనాలు దారి వెంట వెళ్తున్న సమయంలో సైలెన్సర్ల నుంచి వచ్చే నిప్పురవ్వలతో అడవిలో మంటలు అంటుకునే ప్రమాదం పొంచి ఉంది. అదే జరిగితే అడవిలో వన్యప్రాణులకు మేత దొరకదు. అగ్నికి ఆహుతి అవ్వడంతో పాటు వాటి స్థావరాలు కోల్పోతుంటాయి. ఫలితంగా పులుల సంరక్షణ కేంద్రంలో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకం కానుంది.

5+5 మీటర్ల మధ్యలో మూడు మీటర్ల మంట..

పులుల సంరక్షణ ఏరియాలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాలను గుర్తించిన అటవీశాఖ అధికారులు నివారణ చర్యలను ఆయా బీట్ అధికారులకు అప్పగించారు. మంటలు అంటుకునే ప్రాంతాల్లో అధికారులు ఇరువైపులా ఐదు మీటర్ల వెడల్పుతో రాలిన ఆకులను మూడు మీటర్ల పొడువునా పోగు చేస్తున్నారు. ఇందుకోసం ప్రతీ కిలోమీటర్ పనికి అటవీశాఖ పనులు చేసే కూలీలకు రూ.రెండు వేల వరకు చెల్లిస్తోంది. ఇరువైపులా ఊడ్చిన ఆకులకు నిప్పు అంటించి రాలిన ఆకులు పూర్తిగా కాలి బూడిదయ్యే వరకు పర్యవేక్షిస్తుండాలి. ఫలితంగా రహదారులకు ఇరువైపులా పది మీటర్ల మేర రాలిన ఆకులను కాల్చివేయడంతో వాహనాల నుంచి వచ్చే నిప్పురవ్వలతో అగ్ని ప్రమాదం తప్పుతుంది. అలాగే, అడవిలో గుర్తించిన ప్రాంతాలు, రాలిన ఆకులను కాల్చి వేస్తున్నారు. ఫలితంగా అడవిలో రాలిన ఆకులకు నిప్పు అంటుకునే అవకాశం లేకుండా చేస్తే వన్యప్రాణుల మేతపై ప్రభావం పడకుండా వాటికి ఎలాంటి హానీ కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

నిరంతరం పనులు నిర్వహిస్తాం



వేసవి ప్రారంభం అవుతుండడంతో అడవిలో ఆకురాల్చు కాలం మొదలైంది. దీంతో చిన్న నిప్పురవ్వ ఎగిసిపడినా అడవి మొత్తం మంటలు అంటుకునే ప్రమాదం ఉంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా టైగర్ జోన్‌లో బర్నింగ్ ఏరియాలను గుర్తించి ఫైర్‌లైన్ పనులు నిర్వహిస్తున్నాం. ఈ పనులను క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా అడవిలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవు.

– గులాం మొయినొద్దీన్, బీర్సాయిపేట్ రేంజ్ అధికారి

అక్రమ లేఅవుట్ల తొలగింపు



జేసీబీతో హద్దురాళ్లను తొలగిస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో వెలిసిన అక్రమ లేఅవుట్ల పరిస్థితిని వివరిస్తూ లే ఔట్, రియల్ దందా శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ స్పందించారు. అక్రమ లేఅవుట్లను తొలగించాలంటూ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అక్రమ లేఅవుట్లపై ఎట్టకేలకు చర్యలకు ఉపక్రమించారు. ఈ నెల 4వ తేదీన సర్వే నంబర్ 68లోని లేఅవుట్‌ను తొలగించారు. తాజాగా టీపీవో అనురాధా ఆధ్వర్యంలో అనుకుంట శివారులోని సర్వే నంబర్‌లో 110లో గల అక్రమ లేఅవుట్‌ను తొలగించివేశారు. జేసీబీ సాయంతో అక్కడకు చేరుకున్న మున్సిపల్ సిబ్బంది హద్దురాళ్లను తీసివేయించారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల వంటావార్పు



సబ్‌స్టేషన్ ఎదుట వంటావార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న రైతులు

సారంగపూర్: త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో కోతలు, సమయపాలన పాటించకుండా ఇష్టారీతిన విద్యుత్ సరఫరా చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని బీరవెల్లి గ్రామ రైతులు సారంగాపూర్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ముట్టడించారు. అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. సబ్‌స్టేషన్ గేటు ఎదుట వంటావార్పు చేపట్టారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం కనీసం 6 గంటలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. వేళాపాల లేని విద్యుత్ సరఫరాతో తమ పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటల విద్యుత్ ఇస్తామంటే బీడు భూములను సైతం అప్పులు చేసి చదును చేయించి సాగులోకి తెచ్చామని తెలిపారు. లక్షల రూపాయలతో బోర్లు వేయించామని పేర్కొన్నారు. తీరాచూస్తే సాగుకు 6 గంటలు కూడా కరెంటు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీరవెల్లి, ప్యారమూర్, వంజర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ భార్య ఆత్మహత్య

- అదనపు కట్నం కోసం వేధింపులే కారణం
- కుటుంబ సభ్యుల ఆరోపణ
- కఠినంగా శిక్షించాలని డిమాండ్



జ్యోతి(ఫైల్)



రిత్విక్, భవిష్య

మంచిర్యాలక్రైం: మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ నల్లమల్ల బాలకృష్ణ భార్య జ్యోతి(32) మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పట్టణంలో సంచలనం సృష్టించింది. బాలకృష్ణ స్థానిక ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో భార్య, కుమారుడు రిత్విక్, కూతురు భవిష్యలతో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం విధుల్లోకి వెళ్లిన కమిషనర్ మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపు లోపల గడియ పెట్టి ఉంది. అనుమానంతో తలుపు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూమ్‌లో జ్యోతి ఫ్యానుకు చున్నితో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. జ్యోతి మృతదేహాన్ని కిందకు దింపి పోలీసులకు సమాచారం అందించాడు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, ఎస్సైలు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ భార్య కావడంతో చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఆత్మహత్య కాదు.. హత్యే..!

జ్యోతి తల్లిదండ్రులు గంగవరపు రవీంద్రకుమారి, రాంబాబు సంఘటన స్థలానికి చేరుకుని ఆమెది ఆత్మహత్య కాదని, హత్యేనని ఆందోళనకు దిగారు. ఉదయం తమ కూతురు వీడియో కాల్ చేసి మాట్లాడిందని, చంపేసేలా ఉన్నాడని రోదించిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లా కేశవపురానికి చెందిన బాలకృష్ణ కానిస్టేబుల్ ఉద్యోగం చేసేవాడని, 2014, ఆగస్టు 15న పెద్దల సమక్షంలో వివాహం జరిగిందని, మూడెకరాల పొలం, రూ.2 లక్షల విలువైన బంగారం అందజేసినట్లు తెలిపారు. కమిషనర్‌గా ఎంపికైన తర్వాత నుంచి గొడవలు మొదలయ్యాయని, తాను కమిషనర్‌నని, ఎక్కువ కట్నం వచ్చేదంటూ వేధించేవాడని ఆరోపించారు. పలుమార్లు కుటుంబ పెద్దల సమక్షంలో మందలించినట్లు తెలిపారు. జ్యోతి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని వేడుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ నారాయణ్‌నాయక్ తెలిపారు.

అమ్మా.. ఏమైంది..!

మంచిర్యాలటౌన్: ఉన్నత ఉద్యోగి భార్య.. కుమారుడు, కూతురుతో హాయిగా జీవితం సాగిపోతోంది. ఉదయాన్నే ఇద్దరు పిల్లలను రోజూ మాదిరిగా సిద్ధం చేసి, టిఫిన్ బాక్సు పెట్టి నవ్వుతూ టాటా చెప్పి బడికి పంపించింది. ఏం జరిగిందో గానీ మధ్యాహ్నం వరకు ఆ తల్లి విగతజీవిగా మారింది. ఈ దృశ్యాన్ని చూసిన చిన్నారులు రిత్విక్, భవిష్య ''అమ్మా.. ఏమైంది..'' అంటూ విలపించిన తీరు అక్కడున్న వారిని కదిలించింది. ''అమ్మా లే అమ్మా... ఏమైంది అమ్మా.. ఎందుకు లేస్తలేవు..'' అంటూ తల్లి మృతదేహం వద్ద విలపించారు.

వాహనాల తనిఖీ

తాంసి: భీంపూర్ మండల కేంద్రానికి సమీపంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. నిబంధనలు పాటించని రెండు ఆటోలు, మ్యాక్స్ వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ కిష్టయ్య, సిబ్బంది ఉన్నారు.

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు



మహేశ్‌ను అరెస్టు చూపుతున్న ఎస్సై సాయికుమార్

లోకేశ్వరం: మండల కేంద్రంలో సోమవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన మండల కేంద్రానికి చెందిన అంకం మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను దుర్భాషలాడి, దాడి చేసినందుకు మహేశ్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు స్వగ్రామానికి గల్ఫ్ కార్మికుడి మృతదేహం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్‌కార్మికుడు అబ్దుల్ జహీర్(25) జనవరి 1న సౌదీలో మృతిచెందాడు. సౌదీ రాజధాని రియాద్ నగరంలోని మలాస్‌లోని 14 రోడ్‌లోని ఓ ఇంట్లో మైనస్ డిగ్రీల చలి కారణంగా గదిలో ఏర్పాటు చేసిన రూం వార్మర్ నుంచి వెలువడిన పొగతో అస్వస్థతకుగురై జహీర్ చనిపోయాడు. జహీర్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు గల్ఫ్‌కార్మికుల అవగాహన వేదిక వ్యవస్థాపకుడు దొనికెని కృష్ణ, సభ్యులు ఫారుక్, రఫీక్, రాంరెడ్డి, చాంద్, సిద్దిక్, హుస్సేన్, ముజామిల్ సహకారంతో ఇండియన్ ఎంబసీ తదితర చోట్ల డాక్యుమెంటేషన్ వంటి పనులను పూర్తిచేశారు. సౌదీలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు రియాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి మృతదేహాన్ని ఇండియాకు పంపించారు. మంగళవారం రాత్రి 11:10 గంటలకు హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకుంటుంది. అక్కడి నుంచి స్వగ్రామానికి ప్రత్యేక వాహనంలో తీసుకువస్తారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు, 29 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష, 29 మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ కోర్టు తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్ , రాజశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరుపరిచారు. ఇందులో ఆరుగురికి సాధారణ జైలు, 29 మందికి రూ.43,700 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అజీజ్ రెహమాన్ తీర్పు ఇచ్చారు.

రూ.257 కూలీ వచ్చేలా పనిచేయాలి

దండేపల్లి: ఉపాధిహామీ పథకంలో కూలీలు దినసరి కూలి రూ.257 వచ్చేలా పనిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి అన్నారు. మండలంలోని మేదరిపేట సమీపంలో డిస్ట్రిబ్యూటరీ కాలువలో చేపట్టిన పూడిక తీత పనులను మంగళవారం పరిశీలించారు.

ఎడ్‌బిడ్‌లో కుస్తీ పోటీలు



కుస్తీ పోటీలను తిలకిస్తున్న భక్తులు

ముథోల్ : మడలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మల్లన్న జాతర కొనసాగుతోంది. మంగళవారం ఆలయ ప్రాంగణంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ కుస్తీ పోటీలను ప్రారంభించారు. కుస్తీ పోటీలకు నియోజకవర్గం నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా మల్లయోధులు వచ్చారు. అంతకు ముందు ఏఎస్పీని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. జాతర సందర్భంగా ఎడ్‌బిడ్‌లో ఎటు చూసినా జనమే కనిపించారు. సీఐ వినోద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కుస్తీ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన మల్లయోధుడికి రూ.10 వేల నగదు, 50 గ్రామల వెండి కడియం, ద్వితీయ బహుమతి రూ.5 వేల నగదు, 25 గ్రాముల వెండి కడియం బహూకరించారు.

సీసీ కెమెరాలు ప్రారంభం ...

ఎడ్‌బిడ్ గ్రామంలో గ్రామ కమిటీ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ప్రారంభించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న భైంసా ఏఎస్పీ



కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

బాబాపూర్ వాగులో మొసలి

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ సమీపం వాగులో మూడు రోజులుగా మొసలి తిరుగుతోందని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం వాగు ఒడ్డున పొదల్లో మొసలి కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మామడ ఎఫ్ఎస్‌వో లక్ష్మణ్ వెంటనే బాబాపూర్‌కు సిబ్బందితో వచ్చారు. గ్రామస్తులతో కలిసి వాగును పరిశీలిస్తుండగా చెక్‌డ్యామ్ వద్ద మొసలి కనిపించిందని ఎఫ్ఎస్‌వో తెలిపారు. వాగులోకి ఎక్కువ మొత్తంలో నీరు వస్తుండడంతో అది వెంటనే నీటిలోకి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. గ్రామస్తులు వాగువైపు వెళ్లొద్దని సూచించారు. వాగులో నీరు తగ్గగానే దానిని పట్టుకుంటామని తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన కిరాణషాపు, పిండిగిర్నీ

కుభీర్: మండలంలోని నిగ్వ గ్రామానికి చెందిన దశరథ్ కిరాణషాపులో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కిరాణషాపులోని సామగ్రితోపాటు పిండి గిర్నీ పూర్తిగా కాలిపోయాయి. రోజులాగానే దశరథ్ సోమవారం రాత్రి తన షాప్ మూసివేసి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజాము సుమారు 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి దశరథ్‌కు సమాచారం అందించారు. మంటలు ఆర్పేశారు. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం సాయం అందించాలని వేడుకుంటున్నాడు.

పోడు భూములకు పట్టాలివ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం సభ్యులు

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు



డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మామడ: పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, అటవీ సంరక్షణ నియమాలు–2022 ఉపసంహరించుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు కోరారు. ఈమేరకు మామడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు శాటిలైట్ మ్యాప్ పేరుతో పట్టాలు రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే అటవీ సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టాలు ఇవ్వడంలో జాప్యం చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఆందోళనలో సంఘం జిల్లా అధ్యక్షుడు సర్దార్, గోపి నర్సయ్య, లక్ష్మణ్, ఇఫ్టు జిల్లా అధ్యక్షుడు రాజేశ్, స్వామి, గంగన్న, ప్రసాద్, శ్రీనివాస్, లింగన్న పాల్గొన్నారు.

అడవులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న కేంద్రం

ఖానాపూర్: కేంద్రం అడవులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ అటవీ హక్కులను నిర్వీర్యం చేస్తోందని ఏపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య ఆరోపించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ ఆదివాసులు, ఇతర పేదలను అడవి నుంచి తరలించడానికి భూగర్భ వనరులను కార్పొరేట్ కంపెనీలకు ధారదత్తం చేయడానికి అటవీ సంరక్షణ నియమాల పేరుతో అటవీ గ్రామాల ప్రజలపై యుద్ధాన్ని ప్రకటించిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2022, జూన్ 28న అటవీ సంరక్షణ నియమాల పేరుతో తెచ్చిన నిబంధనలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని కోరారు. అటవీ సంరక్షణ నియమాలు 2022ను ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేయాలని సూచించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఫారుక్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు డాకూరి తిరుపతి, మడావి అంకుశ్‌రావు, ఆకుల సత్తన్న, మడావి లింగు, జక్కుల రాజన్న, కుంచపు ఎల్లయ్య, మున్వర్, వర్మ, సుదర్శన్, చందు, భీంరావు పాల్గొన్నారు.

జొన్నరొట్టెకు తగ్గని ఆదరణ



ఇచ్చోడ: కొన్నేళ్ల కిందట గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం ఆహారంలో ప్రత్యేకంగా తీసుకునే జొన్నరొట్టెకు ఇంకా క్రేజ్ తగ్గలేదు. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా అంతా లొట్టలేసుకుంటూ జొన్నరొట్టెను తినాల్సిందే. పట్టణ ప్రాంతంలో నివాసముండే రాథోడ్ మౌనిక మంగళవారం మండలంలోని దేవుల్‌నాయక్‌తండాలో జరిగిన భోగ్ బండార్ కార్యక్రమానికి హాజరైంది. సమీప బంధువుల ఇంటిలో కట్టెల పొయ్యిపై జొన్నరొట్టె తయారు చేస్తుండగా తీసిన చిత్రమిది.

సమస్యల సంత

- మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు
- తాగునీటికి తిప్పలు
- ఇబ్బందుల్లో వ్యాపారులు, వినియోగదారులు


కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు (ఫైల్)

నేరడిగొండ: వారసంతలు సమస్యల లోగిళ్లుగానే ఉంటున్నాయి. పంచాయతీలకు గణనీయంగా ఆదాయం సమకూర్చుతున్నా సౌకర్యాలు కాన రావడం లేదు. ప్రతి శనివారం నిర్వహించే నేరడిగొండ సంతలో ఎటుచూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయి. సంతకు మండలం నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి వినియోగదారులు వస్తుంటారు. చిరు వ్యాపారులు, కొనుగోలుదారులతో సంత ప్రతివారం కిటకిటలాడుతోంది. కాని ఇక్కడ మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతులు లేక వ్యాపారులతోపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి స్థలం లేదు. దీంతో నడిచేందుకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఇష్టానుసారంగా తైబజార్ వసూళ్లు

సంతలో తైబజార్ వసూళ్లు ఇష్టానుసారంగా సాగుతోంది. దుకాణాలు ఏర్పాటు చేసుకునే చిరు వ్యాపారులు, కూరగాయలు విక్రయించే రైతులు, వ్యాపారుల వద్ద తైబజార్ వసూళ్లు చేస్తున్నారు. పంచాయతీ నిర్ణయించిన ప్రకారం దుకాణాల స్థాయిని బట్టి డబ్బులు వసూలు చేయాల్సి ఉంటుంది. కాని అధికంగా వసూళ్లకు పాల్పడుతున్నారని చిరు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. తైబజార్ వసూలు చేయాల్సిన ధరల వివరాలతో పట్టిక బోర్డులు ఏర్పాటు చేయాలి. కాని వాటి ఊసే లేకుండా పోతోంది.

పట్టించుకోని పంచాయతీ..

సంత ద్వారా ప్రతి సంవత్సరం గ్రామ పంచాయతీకి ఆదాయం ఘనంగానే ఉంది. కాని సౌకర్యాలు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ సంవత్సరం తైబజార్ వేలం రూ.3లక్షల 16వేలు పలికింది. కనీసం వీటిని సక్రమంగా వినియోగించినా సమస్యలు తీరేవని చిరు వ్యాపారులు, వినియోగదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం స్పందించి మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

స్థలం అందుబాటులో లేదు..



నేరడిగొండ సంతలో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేసేందుకు స్థలం అందుబాటులో లేదు. సంతకు కూడా స్థలం లేకపోవడంతో రోడ్లపై నిర్వహించాల్సి వస్తోంది. అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం.

– పెంట వెంకటరమణ, సర్పంచ్

అటెన్షన్ ప్లీజ్ — గుంత పూడ్చరూ..



సిరికొండ: మండల కేంద్రంలో వాయిపేట్ రోడ్డులో మిషన్ భగీరథ పైపు లీకేజీ అవుతోంది. గతనెల క్రితం మరమ్మతు కోసం అధికారులు గుంత తవ్వించారు. అప్పటి నుంచి పూర్తి కాకపోవడంతో గుంత ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనదారులు వెళ్తుంటారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – సంప్రదించాల్సిన అధికారి: జైపాల్, మిషన్ భగీరథ ఏఈ, సిరికొండ, సెల్: 63099 54502

వర్మీ కంపోస్టు ఎరువు అందజేత


కలెక్టర్‌కు ఎరువు బాక్స్ అందజేస్తున్న సర్పంచ్

బజార్‌హత్నూర్: మండలంలోని వర్తమన్నూర్ గ్రామ సర్పంచ్ కుర్మే నారమ్మ, ఎంపీడీవో చౌహాన్ రాధలు జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు మంగళవారం వర్మీ కంపోస్టు ఎరువును అందజేశారు. పంచాయతీ ఆధ్వర్యంలో సెగ్రిగేషన్ షెడ్డులో రోజువారీ చెత్తతో తయారీ చేసిన వర్మీ కంపోస్టు ఎరువును ఆయనకు అందించారు. ఈ ఎరువును తయారీ చేసి రైతులకు అమ్మి పంచాయతీకి ఆదాయం సమకూర్చుకుంటున్నామని సర్పంచ్ తెలపగా కలెక్టర్ అభినందించారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రణతి, కుర్మే లక్ష్మణ్, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ సంపత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

నేరడిగొండ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండలంలోని అరెపల్లి గ్రామంలో నిర్మిస్తున్న జగదాంబదేవి ఆలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం గురించి గ్రామస్తులతో చర్చించారు. ఎంపీపీ రాథోడ్‌సజన్, నాయకులు రాథోడ్ కమల్‌సింగ్, కరణ్‌సింగ్, ఆడే రవీందర్ తదితరులు ఉన్నారు.

ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిని కలిసిన భూమారెడ్డి


వినోద్‌కుమార్‌తో మాట్లాడుతున్న భూమారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌ను రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో కలిసి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ఆయన వెంట పలువురు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ రమేశ్

ఆదిలాబాద్‌రూరల్: ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ గండ్రత్ రమేశ్ మంగళవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని 54 మందికి ఈ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరంలాంటివన్నారు. వైస్ ఎంపీపీ జంగు, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి రాజు, వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేశ్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హాథ్ సే హాథ్ జోడోయాత్రలో నాయకులు


రేవంత్‌రెడ్డి యాత్రలో పాల్గొన్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ములుగు నియోజకవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు. మంగళవారం ఆయనతో కలిసి నడిచారు. ఈ యాత్రలో ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ అంబకంటి అశోక్, వసంత్‌రావు, శేఖర్, ఇమామ్, అశోక్‌గౌడ్, జాంటి, మల్లయ్య, సుందర్‌సింగ్, దత్త ఉన్నారు.

మండలాన్ని అభివృద్ధిలో ముందుంచుతా


పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిలో ముందుంచుతానని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని ధాన్య నాయక్ తండా గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి పలు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రోడ్లు, తాగునీటి సౌకర్యంతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ అనసూయ వసంత్‌రావు, ఉప సర్పంచ్ విజయ్, సకారాం నాయక్, రాములు, కారోబార్ బలిరామ్, వసంత్‌రావు, బాపూరావు, సుభాష్, ఉత్తమ్, మనోజ్ పాల్గొన్నారు.

వారం రోజుల్లో సమస్యల పరిష్కారం

- మున్సిపల్ కమిషనర్ శైలజ


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలకు సంబంధించిన సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎ.శైలజ తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన పుర ప్రజావాణిలో ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. ఇంటి, నల్ల ట్యాక్స్, అసిస్మెంట్ పేరు మార్పిడి, అక్రమణలకు సంబంధించి ఈ వారం మొత్తం 41 అర్జీలు అందాయి. ఇందులో ఇంజినీరింగ్ సెక్షన్ 2, టౌన్ ప్లానింగ్ 11, రెవెన్యూ సెక్షన్ 22, శానిటేషన్ 2, అకౌంట్స్ సెక్షన్ 1, మెప్మాకు సంబంధించి 3 చొప్పున అర్జీలు అందాయి. వాటిని పరిశీలించిన ఆమె సంబంధిత విభాగాల అధికారులకు అందజేస్తూ పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. భూ సంబంధిత సమస్యలను ఈ గ్రీవెన్స్‌లో స్వీకరించబోమని ఆమె స్పష్టం చేశారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీవో అనురాధ, ఎస్సై నరేందర్, పెంటాజీ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ, ఎమ్మెల్యే


మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్


కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

కైలాస్‌నగర్: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌రాజ్‌ను ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వేర్వేరుగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛాలు, పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతలు, జిల్లాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఎస్పీ కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ ఏడాది ఆదిలాబాద్ జిల్లా అత్యంత సురక్షితమైన జిల్లాలో దేశంలోనే ఐదోస్థానం, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు వివరించారు. అలాగే కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బోథ్ నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్‌సింగ్, నేరడిగొండ ఎంపీపీ రాథోడ్ సజన్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


కనుగుట్టలో క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

బోథ్: రాష్ట్ర బడ్జెట్‌లో దళితబంధుకు రూ.17,700 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కనుగుట్టలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లక్ష్మణ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మణ్, దుబ్బ రాములు, రామకృష్ణ, చిన్న గంగయ్య, కొట్లాడి నడిపెన్న, ఇస్తారి, కిలారి కైలాస్, దుబ్బ శంకర్, మరాటి రాజు, బోడ లక్ష్మి, మంత్రి ఆశమ్మ, కొటాడి కమల, సుజాత, ఆడెళ్ల, జ్యోతి, గంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

బీఫ్ మార్కెట్ పనులు పరిశీలన


పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లోని బొక్కల్‌గూడ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీఫ్ మార్కెట్ పనులను మున్సిపల్ కమిషనర్ ఎ.శైలజ మంగళవారం పరిశీలించారు. వైస్ చైర్మన్ జహీర్ రంజానీతో కలిసి మార్కెట్‌ను సందర్శించిన ఆమె పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. నాణ్యత లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అన్ని వసతులతో మోడల్ బీఫ్ మార్కెట్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. నిర్మాణ సమయంలో కరెంట్ స్తంభం సమస్య ఉండడంతో దాన్ని పరిష్కరించామన్నారు. అనంతరం వ్యాపార సంస్థలకు సంబంధించిన ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించిన కొలతల ప్రక్రియను స్థానిక రాణీసతీజీకాలనీలో ఆమె పరిశీలించారు. పలు దుకాణాలను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న డీఎస్పీ ఉమేందర్

జైనథ్: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ ఉమేందర్ అన్నారు. మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన 13 సీసీ కెమెరాలను స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరాలు అదుపు చేయడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రధాన ప్రధాన కూడళ్లలో వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, సీఐ కోల నరేశ్, సర్పంచ్ గోత్రాల రాధిక సాయినాథ్, ఉప సర్పంచ్ పోతారెడ్డి, నాయకులు రాహుల్‌రెడ్డి, వామన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామానికి చెందిన మైలారపు వంశీ ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ శ్రీనివాస్ అతనికి రూ.5 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందించారు. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, ఎంపీటీసీ రాజమణి మహిపాల్, నాయకులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్‌కు నివాళి


నార్నూర్‌లో నివాళులర్పిస్తున్న దళిత సంఘాలు


ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు


ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు


తలమడుగు: పూలమాల వేస్తున్న సభ్యులు


బోథ్: సొనాలలో పాల్గొన్న గ్రామస్తులు

నార్నూర్: రమాబాయి అంబేద్కర్ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలు సంఘాలు, నాయకుల ఆధ్వర్యంలో ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడిచిన రమాబాయి అంబేద్కర్ అని కొనియాడారు. నార్నూర్‌లోని బుద్ధ విహార్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా సంఘాల నాయకులు దుర్గే రుక్మాబాయి, మీనాబాయి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రమాబాయి సంఘం జిల్లా అధ్యక్షురాలు సారిక, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ జిల్లా కార్యదర్శి కృష్ణాకుమార్, ఇచ్చోడ మాజీ జెడ్పీటీసీ సోన్‌కాంబ్లే రేణుక, స్థానిక సర్పంచ్ చౌహాన్ సునీత పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని అంబేద్కర్ భవనంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో నాయకులు పాల్గొన్నారు. వంచిత్ బహుజన ఆఘాడి పార్టీ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే బాబాసాహెబ్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షులు సర్కలే శివాజీ, భీంఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్‌వాగ్ దత్త, దళిత సంఘాల నాయకులు శివాజీ, సత్యానంద్, ఉత్తం, కామరాజ్, సునీల్, రజినికాంత్, రావువర్ధాన్, భాస్కర్, అతిష్, గజానంద్ ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: రమాబాయి అంబేద్కర్ మహిళ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బుద్ధవిహార్‌లో, ఖుర్షీద్‌నగర్‌లోని ధమ్మదీప్ బుద్ధవిహార్‌లో ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేశారు. మహార్ బెటాలియన్ అధ్యక్షుడు శైలేందర్ వాఘ్మారే, తెలంగాణ మహిళా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు శుబాతాయి తుల్జాపూరే, రమాబాయి మహిళా సంఘం అధ్యక్షురాలు కుశ్వర్తబాయి, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంబ్లే, దళిత సంఘాల నాయకులు, బౌద్ధ ఉపాసకులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని బీఎస్పీ ఆదిలాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు మెస్రం మీనా ఆధ్వర్యంలో పట్టణంలోని కేఆర్‌కే కాలనీలోగల వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఆదివాసీ మహిళా సంఘం నాయకురాలు తులసి, బీఎస్పీ నాయకురాలు కమల, భూమిక, సునీత, పద్మ పాల్గొన్నారు.

బోథ్: సొనాలలో రమాబాయి అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఏఎంసీ డైరెక్టర్ అమృత్‌రావ్ పాటిల్‌ర, మహిళా మండలి సభ్యులు పాముల జ్యోత్స్న, ఆత్మ డైరెక్టర్ తిరుమల్, లక్ష్మి, చక్రవర్తి, ప్రేమల, మునేశ్వర్ సోమన్న, సంతోష్, దేవరావు, లక్ష్మన్, భీంరావ్, శ్యామ్ రావ్, నవ యవజన యూత్ సభ్యులు హరీశ్, లక్ష్మణ్, కార్తీక్, సంజయ్, సిద్దు, మిట్టు, సాత్విక్ పాల్గొన్నారు.

తలమడుగు: మండలకేంద్రంలోని బ్లూబీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ప్రేమేందర్, సభ్యులు రాములు, వంశీ, వినోద్, గంగాధర్ పాల్గొన్నారు.

ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి


విద్యార్థుల అభ్యసన స్థాయిపై ఆరా తీస్తున్న నారాయణ

బేల: విద్యార్థులకు సంబంధించిన 21 అంశాల సమాచారాన్ని ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారి జె.నారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంతోపాటు సైద్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. జైనథ్‌లోని ఎమ్మార్సీ, జెడ్పీఎస్ఎస్‌తోపాటు నిరాల ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి అభ్యసన స్థాయిని పరిశీలించారు. మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో విద్యార్థుల సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని డాటాఎంట్రీ ఆపరేటర్లు, మిస్ కోఆర్డినేటర్లు, సీఆర్పీలకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట స్టాటస్టికల్ కోఆర్డినేటర్ సూరజ్‌రావు, ఎంవోఎంబీ డీఆర్పీ శ్రీపద్, హెచ్‌ఎంలు ఉన్నారు.

డిస్ట్రిక్ లెవల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ కాంపిటీషన్‌లో ప్రతిభ


ఓంకార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న డీఈవో ప్రణీత

బజార్‌హత్నూర్: జిల్లాకేంద్రంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో మంగళవారం డిస్ట్రిక్ లెవెల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఇందులో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్‌లో మండల కేంద్రానికి చెందిన ఆదర్శ పాఠశాల 9వ తరగతి విద్యార్థి డి.ఓంకార్ 57.5/60 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి, స్టేట్ లెవెల్ కాంపిటీషన్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. డీఈవో ప్రణీత ఆ విద్యార్థికి జ్ఞాపికతోపాటు అర్హతపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయులు సుభాష్, సాగర్, నవీన్, జ్ఞానేశ్వర్‌లు ఈ సందర్భంగా ఓంకార్‌ను అభినందించారు.

నియామకం

తాంసి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ నూతన చైర్మన్‌గా బెల్లపు విలాస్‌ను మంగళవారం నియమించినట్లు హెచ్‌ఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సర్పంచ్ కృష్ణ, ఉపాధ్యాయులు పవన్, శ్రీనివాస్, కిరణ్‌లు ఈ సందర్భంగా విలాస్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

గుండపయ్య భీమన్న దేవుడి జాతర


ఆలయం వద్ద భక్తులు

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో గుండపయ్య భీమన్న దేవుడి జాతర ఘనంగా నిర్వహించారు. గత నాలుగు రోజుల నుంచి భక్తులు దేవుడి ప్రతిమను గంగ స్నానానికి తీసుకెళ్లి పుణ్యస్నానాల అనంతరం సోమవారం రాత్రికి సిరిచెల్మకు చేరుకున్నారు. మంగళవారం తెల్లవారుజాము ఉత్సవ విగ్రహాలను గ్రామ ప్రధానవీధుల గుండా ఊరేగించారు. అనంతరం పూజలు చేశారు. నాయక్‌పోడ్ కులస్తుల సంప్రదాయ వాయిద్యాలతో గుండపయ్య విగ్రహాన్ని ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు.

ఏసీడీ చార్జీలు రద్దు చేసేవరకు బిల్లులు చెల్లించొద్దు


మాట్లాడుతున్న సామాజిక కార్యకర్తలు

నేరడిగొండ: విద్యుత్ శాఖ ఏసీడీ చార్జీలు రద్దు చేసేవరకు మండల ప్రజలు బిల్లులు చెల్లించొద్దని సామాజిక కార్యకర్తలు, నేరడిగొండ వార్డు సభ్యులు సాబ్లే సంతోష్‌సింగ్, రాథోడ్ రాజశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 24 గంటల పాటు విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పుకుంటున్న రాష్ట్రప్రభుత్వం 10 గంటలకు పైగా కోతలు విధిస్తోందని విమర్శించారు. విద్యుత్ వినియోగదారులకు భారంగా మారిన ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని లేకపోతే ప్రజలతో కలిసి సబ్‌స్టేషన్ ముట్టడిస్తామన్నారు. సమావేశంలో రైతులు రమణ, జాట్వే శ్రీను, రాజు పాల్గొన్నారు.

ఘనంగా శబరిమాత ఆలయ వార్షికోత్సవం

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మాన్నూర్‌లో శబరిమాత ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించి గ్రామస్తులు వేడుకలను ప్రారంభించారు. అనంతరం అమ్మవారి పాదుకలతో నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం అన్నదానం చేపట్టారు.